ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 198    సోమవారం 27 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## అమెరికాను భయపెడుతున్న ఖైబర్ షెకాన్..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 26)

అమెరికాను ఇన్నాళ్లు షాహెద్ డ్రోన్లు గుక్క తిప్పుకోనీయకుండా చేస్తే.. ఇప్పుడు దానికి తోడుగా ఓ చౌకబారు క్షిపణి వచ్చి చేరింది. దాని పేరు ఖైబర్ షెకాన్. దీని రేంజి 1,400 కిలోమీటర్లు. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై జరిగిన భీకర దాడుల్లో ఈ క్షిపణిదే కీలక పాత్ర. పాత ఇరాన్ క్షిపణులతో పోలిస్తే ఇది విభిన్నమైనది. ఘన ఇంధనంతో పనిచేస్తుంది. శత్రువుపై వినియోగించే ముందు.. దీనిలో ఇంధనం నింపాల్సిన అవసరం లేదు. ఫలితంగా వీటిని ట్రక్కులపై లోడ్ చేసి.. వేగంగా తరలించి శత్రువుపై దాడి చేయవచ్చు. దీంతో ఇరాన్ క్షిపణి ▶2లో

## ఇకపై ఏ ఎన్నికల్లో పోటీచేయను: సిద్ధరామయ్య



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 26)

తాను 2028 అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఇకపై ఏ ఇతర ఎన్నికల్లోనూ పోటీ చేయబోనని కర్ణాటక మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య ప్రకటించారు. రాజకీయ రంగం అవినీతిమయంగా మారిపోయిందని.. తనకూ వయసు పైబడటం, అనారోగ్య కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తనకు 79ఏళ్లని.. తన పదవీకాలం ఇంకా ఏడాదిన్నర పాటు ఉందని పేర్కొన్నారు. అప్పటికి తన వయసు 81-82 ఏళ్లకు చేరుకుంటుందన్నారు. ఆరోగ్యం బాగాలేకపోవడం వల్ల మునుపటిలా అదే ఉత్సాహంతో పనిచేయడం ఇక సాధ్యం కాదని వెల్లడించారు. అయితే ప్రజా జీవితంలో చురుకుగా ఉంటూ ప్రజల తరఫున గళం మాత్రం వినిపిస్తూనే ఉంటానని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. 2028 నాటికి తన రాజకీయ ప్రస్థానం 50ఏళ్లకు చేరుకుంటుందని సిద్ధరామయ్య తెలిపారు. 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించానని.. దశాబ్దాల కాలంలో ఎన్నో విజయాలు, ఓటములు చవిచూశానని పేర్కొన్నారు. ▶2లో

## కరిగిపోతున్న అమెరికా ఎయిర్ డిఫెన్స్ క్షిపణుల నిల్వలు.. ఆందోళనలో ట్రంప్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 26)

ఇరాన్‌పై దాడుల విషయంలో అమెరికా కొంచెం వెనక్కితగ్గింది. తమ వద్దనున్న ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్లో క్షిపణుల నిల్వలు తగ్గిపోతున్నాయనే ఆందోళనల నేపథ్యంలోనే ఇరాన్‌పై సైనిక చర్యలు తీవ్రం చేసే ప్రణాళికలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. సీనియర్ సలహాదారులతో సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా దళాలు, స్థావరాల రక్షణ కోసం పోరాడితే నిల్వలు వేగంగా కరిగిపోవచ్చని సైనికాధికారులు హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ప్రస్తుత యుద్ధంలో ఇరాన్ చౌకగా తయారు చేసిన డ్రోన్లను భారీ సంఖ్యలో వినియోగిస్తోంది. ఒక్కో డ్రోన్ ధర కేవలం 20వేల నుంచి 50వేల డాలర్లలోపే. అయితే వీటిని ఎదుర్కోవడానికి అమెరికా వినియోగిస్తున్న ఒక్కో ఇంటర్‌సెప్టర్ క్షిపణి ధర మాత్రం 1.5 మిలియన్ డాలర్ల పైమాటే. ఆర్థికపరమైన ఈ అంతరం యుద్ధంలో అమెరికాపై ప్రభావం చూపనుందని నిపుణులు అంటున్నారు. అంతే కాకుండా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు తీవ్రం చేయడంతో అమెరికాకు చెందిన అనేక స్థావరాలు ▶2లో

# కూటమి పాలనకు రెండేళ్లు

## నేటి నుంచి టీడీపీ ఇంటింటి ప్రచారం...

- రెండేళ్ల కూటమి పాలనపై రేపటి నుంచి 45 రోజుల పాటు డోర్ టు డోర్ ప్రచారం
- ప్రభుత్వ విజయాలను, హామీల అమలును ప్రజలకు వివరించాలని నేతలకు చంద్రబాబు ఆదేశం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలవడమే లక్ష్యంగా పనిచేయాలని సూచన
- అనుచరులుగా కాదు, నాయకులుగా ఎదగాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- గొడ్డలి పార్టీ విధ్వంసకర విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని దిశానిర్దేశం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 26)

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రేపటి నుంచి (సోమవారం) 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'డోర్ టు డోర్' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ బృహత్ కార్యక్రమంలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంత్రుల నుంచి బూత్ స్థాయి కన్వీనర్ల వరకు పార్టీ యంత్రాంగం మొత్తం ఈ అవుట్ రీచ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారని గుర్తుచేశారు. "94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్లతో మనం గెలిచాం. నాటి ప్రభుత్వ విధ్వంసం, ఘోర తప్పిదాల వల్లే 151 సీట్ల పార్టీ 11 సీట్లకు పడిపోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు. కూటమి పార్టీల పోరాటాలు, ఎన్నికల వ్యూహాల వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని తెలిపారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ప్రజలకు మరింత చేరువ ▶2లో

## నేడు కృష్ణా జిల్లాలో నారా లోకేశ్ పర్యటన...



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 26)

పెనమలూరు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు పునాదిపాడులో నూతన బాలికల జూనియర్ కళాశాల భవనం టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశంలో భేటీ రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ రేపు సోమవారం (జూలై 27) కృష్ణా జిల్లాలో పర్యటించనున్నారు. పెనమలూరు నియోజకవర్గంలో ఆయన పలు అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఆయన పర్యటనకు ▶2లో

## వైఎస్ షర్మిల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి నారా లోకేశ్ స్పందన

- పొత్తికడుపు సంబంధిత శస్త్రచికిత్స చేయించుకున్న వైఎస్ షర్మిల
- తాను కోలుకుంటున్నట్లు సోషల్ మీడియాలో వెల్లడి
- షర్మిల ఆరోగ్యంపై స్పందించిన మంత్రి నారా లోకేశ్
- ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ట్వీట్



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూలై 26)

ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల త్వరగా కోలుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై లోకేశ్ స్పందిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. షర్మిల వేగంగా కోలుకుంటున్నారని తెలిసి సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. "షర్మిల గారూ, మీరు త్వరగా ▶2లో



## యూపీలో పొత్తుకు సిద్ధం.. అఖిలేశ్‌కు అసదుద్దీన్ ఓవైసీ ఓపెన్ ఆఫర్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 26)

దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో మరోసారి రాజకీయ సమీకరణాలు వేడెక్కుతున్నాయి. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్‌కు పొత్తు కోసం బహిరంగ ఆహ్వానం పంపారు. బీజేపీని మరోసారి అధికారంలోకి రాకుండా నిలువరించేందుకు కలిసి పని చేయడానికి ఇదే సరైన సమయమని ఆయన స్పష్టం చేశారు. ▶2లో

## వైకాపా నేతలకు బీసీ గర్జన పెట్టే నైతికత ఉందా?

### మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 26)

'వైకాపా ప్రభుత్వంలో అమర్‌నాథ్‌గౌడ్, తోట చంద్రయ్య, నందం సుబ్బయ్యలాంటి 74 మంది బీసీల్ని పొట్టన పెట్టుకొని.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని బీసీ గర్జన పెడతారు' అంటూ.. వైకాపా నేతల్ని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. బీసీ గర్జన పెట్టే నైతికతే వారికి లేదని దుయ్యబట్టారు. అప్పట్లో బీసీల మీద హత్యలు, దాడులు జరిగినప్పుడు జోగి రమేష్, విడదల రజని, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణలాంటి వాళ్లు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. ▶2లో



## 17 నుంచి పూర్తిస్థాయి సేవలకు భోగాపురం సిద్ధం మంత్రి కొండపల్లి శ్రీనివాస్




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 26)

భోగాపురం విమానాశ్రయం ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆగస్టు 1న ప్రారంభమవుతుందని, అదే నెల 17 నుంచి పూర్తిస్థాయిలో సేవలకు సిద్ధమవుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. భోగాపురం విమానాశ్రయం వద్ద శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రధాని బహిరంగ సభకు ఉత్తరాంధ్ర నుంచి ఐదు వేల బస్సుల్లో ప్రజలు తరలివస్తారన్నారు. మరోవైపు విశాఖ నుంచి విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికుల కోసం జీఎంఆర్ సంస్థ 69 మెట్రో బస్సులను కేటాయించిందని వెల్లడించారు. విమానాశ్రయం పక్కనే జీఎంఆర్ ఏవియేషన్ యూనివర్సిటీ, ఏపీలోనే తొలిసారిగా ఎమ్మార్వో ఫ్లైట్ మెయింటెనెన్స్ సదుపాయం అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి వివరించారు.

ప్రధాని పర్యటన షెడ్యూల్ విడుదల

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ షెడ్యూల్ అధికారికంగా విడుదలైంది. ఆగస్టు 1న ఉదయం 10.45 గంటలకు ప్రత్యేక విమానంలో ప్రధాని ఢిల్లీ నుంచి భోగాపురం విమానాశ్రయానికి చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం తర్వాత సుమారు రెండున్నర గంటల పాటు ఆయన ఇక్కడ గడపనున్నారు.

## నేటి నుంచి 'ఇంటింటికి తెలుగుదేశం'

- ఎన్డీయే రెండేళ్ల పాలన విజయాలపై 45 రోజుల పాటు ప్రచారం
- సూపర్-6 హామీల అమలు తీరును ప్రజలకు వివరించనున్న టీడీపీ
- గత ప్రభుత్వ పాలనతో తేడాలను స్పష్టం చేయాలని శ్రేణులకు పిలుపు
- ప్రజల సమస్యలు, సూచనలు స్వీకరించనున్నట్లు వెల్లడి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 26)

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధమైంది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సారథ్యంలో 'ఇంటింటికి తెలుగుదేశం' పేరుతో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. రేపు సోమవారం (జులై 27) ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ▶2లో

## మన యువశక్తిని చూసి గర్వపడుతున్నా: 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

- దేశ యువశక్తిపై గర్వంగా ఉందన్న ప్రధాని మోదీ
- 'మన్ కీ బాత్'లో యువత సాధించిన విజయాల ప్రస్తావన



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 26)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 136వ ఎపిసోడ్‌లో దేశ యువత సాధిస్తున్న విజయాలపై ప్రశంసల వర్షం కురిపించారు. అంతరిక్షం నుంచి సైన్స్ ఒలింపియాడ్స్ వరకు వివిధ రంగాల్లో యువత అద్భుత ప్రతిభ కనబరుస్తోందని, ▶2లో

## మొదటి పేజీ తరువాయి

# కూటమి పాలనకు రెండేళ్లు

కావాలని పిలుపునిచ్చారు. "ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఎలాగైతే ప్రతి ఇంటికీ వెళ్లారో, ఇప్పుడు కూడా అదే విధంగా వెళ్లి మనం ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తున్నామో చెప్పాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి" అని సూచించారు.

**నాకు కావాల్సింది అనుచరులు కాదు!**

పార్టీలో నాయకత్వ పటిమను పెంచుకోవాల్సిన ఆవశ్యకతను చంద్రబాబు నొక్కిచెప్పారు. "నాకు కావాల్సింది అనుచరులు కాదు, పార్టీకి నాయకులు కావాలి. సమస్యలకు పరిష్కారం చూపే నైపుణ్యాలను అలవర్చుకోవాలి. కష్టంతో కాకుండా ఇష్టంతో పనిచేస్తూ ప్రజలు, కార్యకర్తలతో సన్నిహితంగా మెలగాలి" అని ఆయన హితవు పలికారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు.

గొడ్డలి పార్టీవిధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని చంద్రబాబు కోరారు. "ఘోర ఓటమి చవిచూసినా ఆ పార్టీ ఇప్పటికీ సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోంది. వారి విధ్వంసకర విధానాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. యువతను వారు ఏ విధంగా నిర్వీర్యం చేశారో, యువత భవిత కోసం కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి" అని ఆయన అన్నారు. ప్రజలతో నిరంతరం మమేకమైతేనే ప్రతిపక్ష కుట్రలను ఎండగట్టగలమని స్పష్టం చేశారు.

"మళ్లీ కూటమి అధికారంలోకి రావడం ఖాయం, కానీ ఏమరుపాటు వద్దు. రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం కొనసాగాల్సిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ వివరించాలి" అని ఉద్ఘాటించారు. ప్రజల్లో ఉండటాన్ని ప్రతి నాయకుడు బాధ్యతగా స్వీకరించాలని కర్తవ్య బోధ చేశారు.

# అమెరికాను భయపెడుతున్న ఖైబర్ షెకాన్..

లాంఛర్ల కోసం యుద్ధ విమానాలు వెతికే వేళ త్వరగా తప్పించుకొనే అవకాశం ఉంది. యుద్ధం వేళ కొన్ని ఖైబర్ క్షిపణులను కూల్చినా.. ఇరాన్ ప్రత్యేకమైన ఫ్లైట్‌పాత్‌లు, కదలికలు, స్పీడ్‌తో వీటిని అమెరికాకు దొరక్కుండా చేస్తోంది. దీనికి తోడు కొన్ని వేరియంట్లకు ముక్కు భాగంలో ఇరాన్ చిన్న ఇంజిన్లను అమర్చుతోంది. ఇది క్షిపణి దాడి చేయాల్సిన లక్ష్యం దగ్గరయ్యే కొద్దీ దిశను మార్చుకోవడానికి ఉపయోగపడటంతో పాటు.. వేగాన్ని గంటకు 10,000 కిలోమీటర్లకు తీసుకెళుతోంది. ఈ క్షిపణులను అటాక్ డ్రోన్లు, మరికొన్ని మిసైల్స్‌తో కలిపి ఇరాన్ వాడుతోంది.

**కరిగిపోతున్న అమెరికా ఎయిర్ డిఫెన్స్ క్షిపణుల నిల్వలు.. ఆందోళనలో ట్రంప్**

యుద్ధం ప్రారంభం నాటికి ఇరాన్ వద్ద సుమారు 2,500 ఖైబర్ షెకాన్ క్షిపణులు, ఇతర మిసైల్స్ ఉన్నాయని అమెరికా అంచనావేసింది. వీటితోపాటు అండర్ గ్రౌండ్ ఆయుధ కేంద్రాల్లో మరిన్ని అసెంబ్లింగ్ చేస్తున్నట్లు భావిస్తున్నారు. కాకపోతే.. క్షిపణి ఇంజిన్ల ఉత్పత్తి కేంద్రాన్ని మాత్రం అమెరికా ధ్వంసం చేసింది. ఇక అమెరికా, ఇజ్రాయెల్ వినియోగించే క్షిపణులతో పోలిస్తే దీని ధర కూడా చాలా చౌక అని ఆయుధ నిపుణులు వెల్లడిస్తున్నారు.

# ఇకపై ఏ ఎన్నికల్లో పోటీచేయను సిద్ధరామయ్య

ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో తాను నమ్మిన సూత్రాలకు విరుద్ధంగా ఎప్పుడూ ప్రవర్తించలేదన్నారు. గతంలో తాను ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు నియోజకవర్గ ప్రజలే స్వచ్ఛందంగా డబ్బు సమకూర్చేవారని సిద్ధరామయ్య తెలిపారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని.. ఎన్నికల్లో పోటీ చేయాలంటే ప్రజలకు డబ్బు పంచాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మద్దతుగా నిలిచిన కర్ణాటక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కొన్ని నెలల క్రితం సిద్ధరామయ్య స్వచ్ఛందంగా కర్ణాటక సీఎం పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. అనంతరం ఆయనను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడిగా నియమిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. ప్రస్తుతం డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## వైకాపా నేతలకు బీసీ గర్జన పెట్టే నైతికత ఉందా?

వైకాపా నేత వైవీ సుబ్బారెడ్డి ముందు మోకరిల్లి బీసీల ఆత్మగౌరవం తాకట్టు పెట్టిన వ్యక్తి మాజీమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు."అదనపు కట్నం కోసం కోడల్ని చిత్రహింసలు పెట్టిన వ్యక్తి జోగి రమేష్. మాజీమంత్రి సీదిరి అప్పలరాజు తన కుమారుడిని రక్షించుకునేందుకు ప్రయత్నించారు తప్పితే.. యాదవ సోదరుడిని కాపాడలేదు. 18 ఏళ్ల కుర్రాడు ప్రమాదం చేస్తే తప్పు కాదంటూ సమర్థిస్తూ జగన్‌రెడ్డి వర్గ వైషమ్యాలు రెచ్చగొట్టేలా వ్యవహరించారు." అని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. "వైకాపా ప్రభుత్వంలో రూ.75 వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధుల్ని దారి మళ్లించారు. స్థానిక సంస్థల్లో బీసీలకున్న 34 శాతం రిజర్వేషన్‌ను 24 శాతానికి తగ్గించి వారి రాజకీయ హక్కుల్ని కాలరాశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నేడు కృష్ణా జిల్లాలో నారా లోకేశ్ పర్యటన...

సంబంధించిన అధికారిక షెడ్యూల్ విడుదలైంది.పర్యటన వివరాల ప్రకారం, సోమవారం ఉదయం 10:15 గంటలకు లోకేశ్ కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నూతనంగా నిర్మించిన బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శిస్తారు. ఈ కార్యక్రమాలు మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయి.మధ్యాహ్నం 1:00 గంట నుంచి 2:30 గంటల వరకు కంకిపాడులోని అయానా కన్వెన్షన్‌లో జరిగే కార్యక్రమంలో లోకేశ్ పాల్గొంటారు. పెనమలూరు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన ప్రసంగించనున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు, టీడీపీ శ్రేణులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు.

## కరిగిపోతున్న అమెరికా ఎయిర్ డిఫెన్స్ క్షిపణుల నిల్వలు.. ఆందోళనలో ట్రంప్

దెబ్బతిన్నాయి. వాటిని రక్షించడానికి పేట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ ఇంటర్‌సెప్టర్‌లు ఇతర ఆయుధాలను పెద్ద మొత్తంలో ఉపయోగించింది. ఫలితంగా ప్రస్తుతం ఆయా ఆయుధాల కొరత ఏర్పడింది. ఈ దాడులు ఇలాగే కొనసాగితే పశ్చిమాసియా దేశాల్లో సైనిక కార్యకలాపాలను పర్యవేక్షించే యూఎస్ సెంట్రల్ కమాండ్‌కు అందుబాటులో ఉన్న ఇంటర్‌సెప్టర్ నిల్వలు గణనీయంగా తగ్గిపోతాయని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కెయిన్ హెచ్చరించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చెంగ్ మాట్లాడుతూ యుద్ధాన్ని కొనసాగించడం కంటే ట్రంప్ దౌత్యపరమైన పరిష్కారాన్నే ఇష్టపడతారని పేర్కొన్నారు. కానీ గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తే మాత్రం అమెరికా తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. మరోవైపు యుద్ధం విషయంలో మధ్యవర్తిత్వం వహించమని శనివారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఖతార్, పాకిస్థాన్‌లను కోరినట్లు తెలుస్తోంది.

## వైఎస్ షర్మిల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి నారా లోకేశ్ స్పందన

కోలుకుంటున్నారని తెలిసి సంతోషంగా ఉంది. మీరు సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కోరుకుంటున్నాను. జాగ్రత్తలు తీసుకోండి" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ మేరకు షర్మిల చేసిన ట్వీట్‌ను ఆయన రీపోస్ట్ చేశారు.ఇటీవల వైఎస్ షర్మిల పొత్తికడుపు సంబంధిత సమస్యతో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించారు. "అవసరమైన ఉదర శస్త్రచికిత్స నుంచి నేను బాగా కోలుకుంటున్నానని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. మీ అందరి ప్రార్థనలకు, మద్దతుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌పైనే నారా లోకేశ్ స్పందించి, ఆమెకు ఆరోగ్య పరామర్శ తెలియజేశారు.

## యూపీలో పొత్తుకు సిద్ధం.. అఖిలేశ్‌కు అసదుద్దీన్ ఓవైసీ ఓపెన్ ఆఫర్

మొరాదాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఓవైసీ మాట్లాడుతూ.. "ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని మజ్లిస్ కోరుకోవడం లేదు. అందుకే నేను చేతులు కలపడానికి, పొత్తు పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. మాట్లాడటానికి ఇదే సరైన సమయం. ఎన్నికలు ముగిశాక తర్వాత ఏడవద్దు" అంటూ అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తమ పార్టీ పోటీ చేయడం వల్ల ఎస్పీకి నష్టం జరుగుతుందనే వాదనను ప్రస్తావిస్తూ, ఆ నష్టం జరగకుండా ఉండేందుకే తాను పొత్తుకు సిద్ధంగా ఉన్నానని వివరించారు.అయితే, ఈ పొత్తులో తమకు సమాన గౌరవం, హక్కులు కావాలని ఓవైసీ స్పష్టమైన సంకేతాలిచ్చారు. "మా పోరాటం ఏ మతానికి వ్యతిరేకం కాదు. మా గౌరవం, న్యాయం కోసమే ఈ పోరాటం. అఖిలేశ్ యాదవ్ కుర్చీలో కూర్చుంటే, నేను కూడా ఆయన ముందు సమానంగా కూర్చుని హక్కులు, న్యాయం గురించి చర్చిస్తాను" అని ఆయన పేర్కొన్నారు.

ఓవైసీ పొత్తు ప్రతిపాదనపై బీజేపీ వెంటనే స్పందించింది. ఇది బుజ్జగింపు రాజకీయాల కలయిక అని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. "అఖిలేశ్, ఓవైసీ ఇద్దరూ బుజ్జగింపు రాజకీయాల్లో ఒకరితో ఒకరు పోటీ పడతారు. ఇప్పుడు 'పెద్ద భాయిజాన్ ఎవరు' అనే పోటీని పక్కనపెట్టి 'భాయిజాన్ కలయిక' కోసం చూస్తున్నారు. అందుకే ఓవైసీ, అఖిలేశ్‌కు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారు" అని ఆయన ఎద్దేవా చేశారు.కాగా, యూపీలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షంగా సమాజ్‌వాదీ పార్టీ ఉంది. 2027 ఎన్నికలను పార్లమెంట్ ఎన్నికలకు సెమీ ఫైనల్‌గా భావిస్తున్న తరుణంలో ఓవైసీ ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ ఆఫర్‌పై అఖిలేశ్ యాదవ్ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

## నేటి నుంచి 'ఇంటింటికి తెలుగుదేశం'

పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, "ఎన్డీయే ప్రభుత్వ రెండేళ్ల సుపరిపాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ వివరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. గత ఏడాది 'సుపరిపాలన తొలి ఏడాది' పేరుతో నిర్వహించిన కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లే, ఈసారి కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలి" అని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 హామీల అమలు తీరును, వాటి ద్వారా మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు పొందిన లబ్ధిని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు."గత ప్రభుత్వ విధ్వంసక పాలనకు, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ అభివృద్ధి పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలి" అని పల్లా పేర్కొన్నారు. కేవలం ప్రభుత్వ విజయాలు చెప్పడమే కాకుండా, ప్రజల నుంచి సమస్యలు, సూచనలను స్వీకరించి, వాటి పరిష్కారానికి పార్టీ, ప్రభుత్వం తరఫున కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం, మిత్రపక్షాల సహకారంతో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులను ఆయన కోరారు.

## మన యువశక్తిని చూసి గర్వపడుతున్నా: 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

దేశ యువశక్తిని చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని అన్నారు.

ఇటీవల విజయవంతమైన 'విక్రమ్-1' ప్రయోగం ప్రతి భారతీయుడి హృదయాన్ని గర్వంతో నింపిందని మోదీ పేర్కొన్నారు. ఇది వికసిత భారత్ లక్ష్యంలో ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి రాకెట్ అని, భారత అంతరిక్ష రంగంలో ఇదొక చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. ఒకప్పుడు ఊహించలేనిదాన్ని మన యువ ఆవిష్కర్తలు సుసాధ్యం చేశారని, వారిలో అసాధారణ నైపుణ్యం, పట్టుదల ఉన్నాయని కొనియాడారు. చాలాకాలంగా ప్రైవేటు రంగానికి దూరంగా ఉన్న అంతరిక్ష రంగాన్ని యువత ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని తెరిచామని, దాని ఫలితాలను నేడు ప్రపంచం చూస్తోందని వివరించారు.అంతరిక్ష రంగంలోనే కాకుండా, సైన్స్ రంగంలోనూ మన యువత దేశానికి గర్వకారణంగా నిలుస్తోందని ప్రధాని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సైన్స్ ఒలింపియాడ్స్‌లో భారత విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచారని చెప్పారు. ఈ నెలలో జరిగిన ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్స్‌లో మన విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. ఫిజిక్స్ ఒలింపియాడ్స్‌లో మన ఐదుగురు విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించారని, దీంతో భారత్ మొదటి స్థానంలో నిలిచిందని మోదీ హర్షం వ్యక్తం చేశారు.గత పదేళ్లుగా ఫిజిక్స్ ఒలింపియాడ్స్‌లో భారత విద్యార్థులు స్వర్ణ లేదా రజత పతకాలు సాధిస్తూ వస్తున్నారని గుర్తుచేశారు. కెమిస్ట్రీ ఒలింపియాడ్స్‌లో పాల్గొన్న విద్యార్థులందరూ స్వర్ణ పతకాలు గెలుచుకున్నారని, ఇది ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన అని పేర్కొన్నారు. అలాగే, బయాలజీ ఒలింపియాడ్స్‌లో స్వర్ణంతో సహా పలు పతకాలు, మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్స్‌లో రెండు స్వర్ణాలు, నాలుగు రజతాలు సాధించారని వివరించారు. దేశ యువశక్తిని చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని అన్నారు. భవిష్యత్తులో మరింత మంది యువత ఇలాంటి ఒలింపియాడ్స్, హ్యాకథాన్లలో పాల్గొని దేశానికి గర్వకారణంగా నిలుస్తారన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో వైభవంగా మాస కల్యాణ మహోత్సవం

మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ఆధ్వర్యంలో వేడుకలు
శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలువేద పఠనంలి
విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్న భక్తులులి





(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జూలై 26)

శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మాస కల్యాణ మహోత్సవం ఆదివారం మఠ ప్రాంగణంలో అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి దివ్య ఆశీస్సులతో, వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కళ్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం నుంచే వేద పండితులు, దేవస్థానం పూజారులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి మాస కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సాగిన ఈ పూజా కార్యక్రమాల్లో మఠాధిపతుల వారి సోదరులు శ్రీ దత్తాత్రేయ స్వామి వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవంలో మాస కల్యాణ ఉభయదాతలు, మఠం సిబ్బంది పరిపూర్ణాచార్యులు, గోపాల చారి, సుబ్బరాయుడుతో పాటు స్థానిక, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులందరికీ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## గ్రామాల వారిగా టిడిపి నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్న కందుల విగ్నేష్‌రెడ్డి





(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూలై 26)

మండలంలోని గ్రామ స్థాయిలలో ఉన్న టిడిపి నాయకులకు, కార్యకర్తలకు మధ్య సమన్వయ లోపం ఉన్నట్లు అధిష్టానం గమనించడం జరిగింది. దీంతో రానున్న స్థానిక ఎన్నికల్లో పూర్తి స్థాయిలో దెబ్బతింటామన్న ఆలోచనలు ప్రతి పంచాయతీలో వెళ్లి విరసడంతోముందుజాగ్రత్త చర్యగా మండలంలోని సీతానాగులవరం, తర్లుపాడు గ్రామాల్లోని టిడిపి నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ టిడిపి యువ నాయకుడు కందుల విగ్నేష్‌రెడ్డి విస్తృత స్థాయిలో సమావేశాలు నిర్వహించారు. ముందుగా సీతానాగులవరంలో నిర్వహించిన సమావేశం విజయవంతం కాగా తర్లుపాడు గ్రామంలో మాత్రం కేవలం నాయకులు మాత్రమే హాజరు కావడం జరిగింది. ముందుగా ఉన్న నాయకులే మా గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని కొందరు, మరి కొందరు ఇతర పార్టీలకు చెందిన యువకులకు మాత్రమే మన పార్టీ ద్వారా ఉపాధి లభించి లబ్ధిపొందుతున్నారే తప్ప మన పార్టీలోని యువతకు మొండి చేయి చూపిస్తున్నారని, ఇలాంటి విషయాల పై అధిష్టానం దృష్టి సారించాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో యువ నాయకుడు కందుల విగ్నేష్‌రెడ్డి నాయకులతో మాట్లాడుతూ ఇలాంటి విషయాలు తమ దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత నాయకులకు లేదా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తి యోగం పై విద్యార్థులకు శిక్షణా తరగతులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 26)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చిన్మయ మిషన్ తోడ్పాటుతో శ్రీగిరి దేవస్థానం గో క్షేత్ర భవన్ లో నిర్వహిస్తున్న శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులు ఫల ప్రదంగా సాగుతున్నాయి, చిన్మయ మిషన్ ప్రబోధకులు స్వామి సత్యాత్మానంద శ్రీగిరి చిన్మయ బాల విహార్ విద్యార్థులకు భగవద్గీతలోని భక్తి యోగం పై అవగాహన కల్పించడంతోపాటు శ్లోకాలను వల్లె వేయించారు. ప్రతి విద్యార్థి స్పష్టంగా శ్లోకాలను పలికేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. సారస్వత సంబంధంమైన శ్లోకాలను కూడా విద్యార్థులకు నేర్పు తున్నారు. నిర్వాహకుల నిరంతర కృషి ఫలితంగా, బాల విహార్ శిక్షణా తరగతులకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతున్నది. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఉదయం 9.30 నుండి 11 గంటల వరకు జరిగే శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జ్ఞానశీలురుగా ఎదిగేందుకు కృషి చేయాలని కోరారు.








ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

27.07.26 సోమవారం


# చెత్త మున్సిపాల్టీ "పొదిలి"



**అధికారులకు ఆదాయవనరుగా పొదిలి మున్సిపాల్టీ**

**ప్రజలకు శాపంగా అధికారుల పాలన**

**రూ.30 వేలు పెట్టి ట్రాక్టర్‌కు మరమ్మత్తు చేయించలేని దుస్థితి**

**కష్టలతో బ్రష్టుపడుతున్న మున్సిపాల్టీ**

**నచ్చిన వారికి లక్షలకు లక్షలు బిల్లులు అందజేత**

**నచ్చకపోతే రూ.10 లు కూడా మంజూరు కాని వైనం**

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 26)

మున్సిపాల్టీ అనగానే ప్రజలు ఎన్నో ఊహించుకుంటారు. పార్కు, సక్రమమైన సైడు కాల్వలు, ఊరి పొడవునా డివైడర్, హెడ్ లైట్లు, చెట్లు ఇలా ఎంతో ఆహ్లాదంగా తయారవుతుందని భావించారు. కానీ పొదిలి మున్సిపాల్టీ మాత్రం అందుకు పూర్తి భిన్నంగా తయారయ్యింది. ఏ మూల చూసినా చెత్తతో దర్శనమిస్తుంది. పొదిలి మున్సిపాల్టీని చూసిన ఎవరైనా సరే ఇది మున్సిపాల్టీనా లేక గ్రామ పంచాయతీనా అనే అనుమానం కలగకమానదు. ఎందుకంటే అంత దరిద్రంగా పొదిలిని అధికారులు తయారు చేశారు. గత వైసీపీ పాలన నాటి నుంచి నేటి వరకు మున్సిపాల్టీ కమిషనర్‌లుగా వ్యవహరించిన వారిలో అధిక శాతం మంది కేవలం మున్సిపాల్టీని ఆదాయవనరుగా చూశారే తప్ప పొదిలిని సుందరంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించిన వారు ఒకరిద్దరు మాత్రమే అని చెప్పవచ్చు. కనీసం ప్రధాన రహదారికిరువైపులా ఉండే ఆక్రమణల తొలగింపులో కూడా రాజకీయాలే....ఏ మున్సిపాల్టీ అయినా సరే ప్రధానంగా ఆక్రమణల తొలగింపు జరిగితే కొంత ఊరు బాగుపడుతుంది. కానీ ఇక్కడ మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది... మున్సిపాల్టీ అధికారులు వసూళ్ళు కోట్ల రూపాయలు చేస్తున్నా ప్రజలకు అందించాల్సిన కనీస సౌకర్యాలు మాత్రం నామమాత్రం కన్నా దారుణంగా అందిస్తున్నారని చెప్పవచ్చు.... పొదిలి మున్సిపాల్టీలో చెత్త సేకరణ విషయం ఇప్పుడు పెద్ద తలనొప్పిగా మారింది. పొదిలి మున్సిపాల్టీ పరిధిలో చెత్తను ఎత్తే స్వీపర్ల సంఖ్య మున్సిపాల్టీ ప్రజలకు తగినట్లుగా లేదు. దీంతో పాటు చెత్తను ఎత్తితే పడవేసే స్థలం కూడా లేని పరిస్థితి. ఉన్న స్థలంలో ప్రస్తుతం ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతంలో పొడి, తడి చెత్త, ప్లాస్టిక్ వస్తువులను వేరు చేసేందుకు ఆ స్థలాన్ని బాగు చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో చెత్తను పడవేయవద్దని వారు మున్సిపల్ అధికారులకు సూచించారు. ఇకపోతే చెత్తను ఎత్తుకునే ఓ ట్రాక్టర్ గడిచిన వారం రోజులుగా మూలనపడింది. కేవలం రూ.20 నుంచి రూ.30 వేలు ఖర్చు చేస్తే ఆ ట్రాక్టర్ బాగుపడుతుంది. కానీ ఆ ట్రాక్టర్‌ను బాగు చేసేందుకు నగదు లేదని బిల్లులు చేయకుండా ట్రాక్టర్‌ను మున్సిపాల్టీ కార్యాలయానికి అంకితం చేశారు.

ఇలా ఏ చిన్న సమస్యను పరిష్కరించాలన్నా కావాల్సిన నగదు మున్సిపాల్టీలో లేకపోవడం శోచనీయం. కేవలం ఇలాంటి సమస్యల పరిష్కారానికి మాత్రమే నగదు ఉండదు. కాని అధికారులు వారికి అవసరమైన వాటికి మాత్రం దర్జాగా ఎంబుక్‌లు చేసి మరీ బిల్లులు చేసుకుంటున్నారు. గత కొన్ని నెలలుగా పొదిలి మున్సిపాల్టీలో కమిషనర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్, మున్సిపల్ ఏఈ, మేనేజర్ ల మధ్య తీవ్ర అంతర్గత వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. వారి మధ్య ఉన్న వివాదాల నేపథ్యంలో ప్రజల సమస్యలను గాలికొదిలేస్తున్నారు. తమకెందుకులే అనే ధోరణిలో ఉన్నారు. వారి జేబులు నిండే బిల్లులను మాత్రం దగ్గరుండి మరీ చేయించుకుంటున్నారు. మొన్నటి వరకు కమిషనర్‌గా పని చేసిన మారుతీరావు సమయంలో మేనేజర్, మున్సిపల్ ఏఈలు పెట్టిన బిల్లులు మంజూరు చేయలేదనే సదరు అధికారులు అప్పట్లో ఆరోపించారు. ఆంజనేయులు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మేనేజర్, మున్సిపల్ ఏఈల బిల్లులు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ పెడుతున్న బిల్లులను నిలుపుదల చేస్తున్నారు. ఇది కేవలం అధికారుల మధ్య ఉన్న అంతర్గత వివాదాలే కారణంగా స్పష్టమవుతుంది. అధికారుల మధ్య ఉన్న వివాదాలతో పొదిలి మున్సిపాల్టీని చెత్త మున్సిపాల్టీగా మారుస్తున్న ఇటువంటి అధికారులు పొదిలి మున్సిపాల్టీకీ అవసరమో లేదో స్థానిక ఎమ్మెల్యే ఒక సారి దృష్టి పెట్టి ఆలోచించాలి. అధికారులు వారికి డబ్బులు వచ్చే పనులను వేగంగా చేస్తున్నారే తప్ప ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల తీరుతో ఈ పాటికే ప్రజలు నాయకుల ను చీదరించుకుంటున్నారు. నాయకులు కూడా ప్రజల సమస్యల పరిష్కారంలో పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎవరి పనులు వారికి అయితే చాలు అనుకునే పరిస్థితిలో స్థానిక నేతలున్నారు. ప్రధానంగా సాగర్ నీరు సక్రమంగా విడుదల కాక ప్రజలు అల్లాడిపోతున్నారు. నేటి నుంచి పొదిలిలో జరిగే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ప్రజలు అటు నాయకులను, ఇటు అధికారుల పై తీవ్ర స్థాయిలో మండిపడడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రజల సమస్యలు పరిష్కరించకుండా ప్రచారానికి వస్తే నాయకులకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారు....మరి ఇప్పటికైనా అధికారులు, నాయకులు ప్రజల సమస్యలు పరిష్కరించి త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ పార్టీని గెలిపించుకుంటారో లేక ఓటమిపాలు చేసుంటారో సదరు నాయకులే తేల్చుకోవాలి....!!




## రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో చిన్న చిన్న సమస్యలు సాధారణం

- ఇప్పటికైనా వైసిపి నాయకులు ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలి
- కూటమి నేతలెవరైనా భుకబ్జాలు చేసినట్లు నిరూపిస్తే గుండుకొట్టించుకుని తిరుగుతా
- అన్నా రాంబాబును వ్యక్తిగతంగా ఎన్నడూ దూషించలేదు
- మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

4

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 26)

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో చిన్న చిన్న సమస్యలు సర్వసాధారణమని, ఇప్పటికైనా వైసీపీ నాయకులు ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు.

## అంబేద్కర్ గురుకులం విద్యార్థిని పరామర్శించిన మంత్రి స్వామి

(షణ్ముఖ వెలుగు, కొండపి, జులై 26)

పాము కాటుకు గురై కొండపి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంబేద్కర్ గురుకులం విద్యార్థిని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆదివారం పరామర్శించారు. కొండపి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి మోక్షిత ఆదివారం పాఠశాలలో పాముకాటుకు గురైంది. వెంటనే పాఠశాల సిబ్బంది విద్యార్థిని కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. ఈ



సందర్భంగా డాక్టర్లను అడిగి మంత్రి విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. విద్యార్థిని ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్లు తెలిపారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదేశించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

**తాసిల్దార్ బదిలీ పై అధికార పార్టీలో వివాదం**

**ఆ తాసిల్దార్ మాకొద్దంటూ నిరసన**

**అధికార పార్టీ నేతల ఆగ్రహం**

**బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే**

**వివాదాల్లో ఉన్న స్థలం ఆన్‌లైన్**

**ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విషయంలో**

**90 మంది అభ్యర్థుల రేషన్ కార్డుల సవరణలు చేయని వైనం**

**సిఎంఓకు ఫిర్యాదు చేసిన పలువురు బాధితులు**

**తిరిగి ఆర్డీఓ కార్యాలయంలో పోస్టింగ్**

**మరో మారు సిఎంఓకు ఫిర్యాదు చేయనున్న బాధితులు**

**అక్రమార్జనే లక్ష్యంగా పనులు**

**పని చేసిన ప్రతీ చోట వివాదాలే...**

**తలలు పట్టుకున్న అధికార పార్టీ నేతలు, ఎమ్మెల్యే**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 26)

ఓ వైపు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు....ఏ పర్యటనకు వెళ్ళినా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే మార్కాపురం జిల్లాలో మాత్రం ఆ తహశీల్దార్ రూటే సపరేట్... అక్రమార్జన లక్ష్యంగా పనులు చేస్తారన్న విమర్శలు కోకొల్లలు. పని చేసిన ప్రతి చోట ఎమ్మెల్యే, అధికార పార్టీ నాయకులు సైతం మాకు ఈ తహశీల్దార్ వద్దంటే వద్దు అని గగ్గోలు పెట్టిన పరిస్థితులున్నాయి. ఎట్టకేలకు ఈ మధ్య కాలంలో జరిగిన తహశీల్దార్‌ల బదిలీల్లో కొనకనమిట్ల మండలం నుంచి పెద్దారవీడు మండలానికి బదిలీ అయ్యారు. బదిలీ అయిన తొలి రోజు నుంచే ఆయన తన ప్రతాపాన్ని ప్రజల పై చూపాడని సదరు మండల పార్టీ నేతలు చెప్పడం విశేషం.... ఏ సమస్య అయినా సరే ఉచితంగా చేయాలంటే ఆయనకు కుదరని పని... రేపు, మాపు అంటూ రెవిన్యూ సమస్యలను పెండింగ్‌లో ఉంచుతూ మండల ప్రజలను నానా తిప్పలు పెట్టారు. ఏదో ఒక కొర్రీ వేస్తూ సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న ఆ తాసిల్దార్ను మాకొద్దంటూ మండలంలో తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. బాధ్యతలు చేపట్టిన




రెండు నెలల వ్యవధిలోనే తాసిల్దార్ వైఖరి పై ఆగ్రహించిన యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి గూడిరి ఎరిక్షన్‌బాబు బదిలీ చేయించారు. అయితే ఆ బదిలీ వెనక అధికార పార్టీ నేతలు తీవ్రంగా ప్రయత్నాలు సాగించారు. తాసిల్దార్ కొనసాగితే మండలంలో అధికార పార్టీ నేతలు, తెలుగుదేశం పార్టీ పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతతో రానున్న రోజులలో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్న టిడిపి మండల నేతల ఆవేదనను అర్థం చేసుకున్న ఇన్చార్జి సత్వరమే ఆ తాసిల్దార్‌ను బదిలీ చేయించారు. అయితే బదిలీ పై వెళ్లిన సదరు తాసిల్దార్ సురేష్‌ను తిరిగి పెద్దారవీడులో కొనసాగించేందుకు ఒకవైపు రెవిన్యూ ఉన్నతాధికారులు, అతను మండలానికి రాకుండా అడ్డుకునేందుకు అధికార పార్టీ నేతలు తీవ్ర ప్రయత్నాలు సాగించి ఎట్టకేలకు నాయకులు సఫలం చెందారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్న తాసిల్దార్ను ఎట్టి పరిస్థితులలో పెద్దారవీడుకు తిరిగి నియమించవద్దంటూ రాష్ట్రస్థాయిలో ఓ మంత్రి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారి చేసినట్టు సమాచారం. ఉమ్మడి జిల్లా కేంద్రంలోని ఒంగోలు చెందిన ఓ టిడిపి కీలక నేత తాసిల్దార్ వ్యవహారంలో జోక్యం చేసుకొని మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం. అయితే తాసిల్దార్ సురేష్ బదిలీ వ్యవహారంలో ఎటువంటి ప్రమేయం లేని ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబు పై దుష్ప్రచారం చేసేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

అటు ఇంచార్జి, ఇటు ఎమ్మెల్యే మధ్య తాసిల్దార్ బదిలీ వ్యవహారం పెద్ద వివాదంగా మారింది. మండల స్థాయి నేతలు అంతా ఆ తాసిల్దారును వ్యతిరేకిస్తుంటే జిల్లా అధికారి మాత్రం అతన్ని వెనకేసుకొస్తూ తిరిగి పెద్దారవీడులో నియమించాలన్న ప్రయత్నం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడంలేదని పలువురు విమర్శించారు. ఏది ఏమైనా పెద్దారవీడు తహసిల్దార్ సురేష్ చివరకు ఆర్డీఓ కార్యాలయ ఏఓ గా బదిలీ అయ్యారు. స్థానిక అధికార పార్టీ నేతల అభిప్రాయం మేరకు మండల ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా రామకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### వివాదాలకు ఆజ్యం పోసిన పలు వ్యవహారాలు

మండల తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల కాలంలో అధికార పార్టీ నేతల నుండి ఈ మేర బదిలీ చేయాలని డిమాండ్ ఒక్క ఈ తహశీల్దార్‌కే మాత్రమే దక్కింది. తహశీల్దార్ వ్యవహార శైలి పై రాష్ట్ర స్థాయి సిఎంఓ కార్యాలయానికి కూడా పలువురు బాధితులు లిఖిత పూర్వక ఫిర్యాదులు కూడా చేశారంటే తహశీల్దార్ పని తీరు ఏ విధంగా అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఈ రెండు నెలల కాలంలో శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ ముంపు గ్రామాల నిర్వాసితుల గ్రామాలు అయిన సుంకేసుల, కలనూతల, గుండంచర్లలో లబ్ధిదారుల సేమ్ పర్సన్ సర్టిఫికేట్లు కావాలని సుమారు 90 మంది జిల్లా కలెక్టర్‌కు అర్జీలు పెట్టుకున్నారు. సదరు ఫైల్స్‌ను సుమారు 20 రోజులకు పైగా తహశీల్దార్ సురేష్ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ వారిని పడిగాపులు గాయించారే తప్ప ఎటువంటి సంతకాలు చేయలేదు. అదే విధంగా కుల ధ్రువీకరణ పత్రాల కొరకు కూడా రోజుల తరబడి విద్యార్థులు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంది. దీంతో పాటు దేవరాజుగట్టు రెవిన్యూ పరిధిలో ఓ వివాదస్పదమైన స్థలాన్ని భారీ మొత్తంలో అక్రమ వసూళ్ళకు పాల్పడి ఆన్‌లైన్ చేసినట్లు మండల అధికార పార్టీ నేతలు బాహాటంగా చెప్పడంతో పాటు ఆ విషయాన్ని సిఎంఓ కార్యాలయానికి కూడా ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారుల మధ్య తేడాలు వచ్చినట్లు కూడా సమాచారం. ఇలాంటి అధికారిని తిరిగి మార్కాపురం ఆర్డీఓ కార్యాలయంలో నియమించడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పని చేసిన ప్రతీ చోట వివాదాలకు కేంద్రబిందువుగా మారాడనే ఆరోపణలు ఉన్నాయి. మరి జిల్లా కలెక్టర్ సదరు తహశీల్దార్ వ్యవహారం పై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే....!!

## రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో చిన్న చిన్న సమస్యలు సాధారణం

పట్టణంలోని జవహర్ నగర్‌లో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో అభివృద్ధిని అటకెక్కిస్తే కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. త్వరలో రూ.200 కోట్లతో పొదిలి, మార్కాపురం పట్టణాలకు ఇంటింటికి పైప్ లైన్ కనెక్షన్లు ఇస్తామని ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని ఇకనుండి ఆ పనిని పూర్తి చేసి ఈ సంవత్సరం కాలంలో ఇంటింటికి సాగర్ నీరు అందిస్తామని అన్నారు. అదే రకంగా రూ.1290 కోట్ల రూపాయలతో మార్కాపురం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని అన్ని గ్రామాలకు ఇంటింటికి త్రాగునీటి పైపులైన్ కలెక్షన్లు ఇచ్చి త్రాగునీటి సమస్య లేకుండా చేస్తామని ఇప్పటికే టెండర్లు పూర్తయి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే ఇచ్చిన మాటకు కట్టుబడి మార్కాపురం జిల్లా ప్రకటించామన్నారు. కనీసం మార్కాపురం ప్రత్యేక జిల్లా పేరు కూడా ఎత్తని నాయకులు ఇప్పుడు మార్కాపురం గురించి మాట్లాడుతున్నారని, ఇది అత్యంత హాస్యాస్పదంగా ఉందన్నారు. పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును ఇప్పుడు మాట్లాడుతున్న వైసీపీ నాయకులు పక్కన ఉండి మరి ప్రారంభోత్సవం చేయించి రైతులను నిట్ట నిలువునా మోసం చేశారన్నారు. ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని మార్కాపురం గురించి మాట్లాడుతున్నారన్నారు. ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చి రైతులను లక్షాధికారులను చేస్తామన్నారు. మీ హయాంలో ఎంత అభివృద్ధి జరిగింది, మా హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో బహిరంగంగా చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, దానికి మీరు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తనకు సోదరుడు లాంటి వాడని, వ్యక్తిగతంగా తాను ఎన్నడూ దూషించలేదని, పార్టీల విధానాల పరంగానే విమర్శించానన్నారు. చివరికి శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి భూములు ఆక్రమించింది కూడా వైసిపి నాయకులేనని, కూటమి నాయకుల్లో ఒక్కరు కూడా కబ్జాలకు పాల్పడలేదని, ఇప్పటికైనా మనసుంటే ఆ వైసీపీ నాయకులను ఒప్పించి దేవదాయ భూములను, ఏబీఎం ఆస్తులను స్వాధీనం చేయాలని సవాల్ విసిరారు. కూటమి నేతలు ఎవరైనా సరే కబ్జా చేసినట్లు రుజువు చేస్తే తాను గుండుకొట్టించుకుని తిరుగుతానని ప్రతిజ్ఞ చేశారు. ఎర్రగొండపాలెం రోడ్ లో బిల్డింగ్ నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడింది మొత్తం వైసిపి నాయకులేనన్నారు. భ్రమరా వెంచర్స్ గురించి వైసిపి నాయకులు మాట్లాడుతున్నారని రియల్ ఎస్టేట్ వ్యాపారంలో చిన్న చిన్న సమస్యలు రావడం సహజమన్నారు. భ్రమరా వెంచర్ పూర్తిగా పట్టా భూముల్లోనే ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. ఎక్కడో కంభం ప్రాంతం నుంచి వచ్చిన వారు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంటే చూడలేక విషం కక్కుతున్నారన్నారు. మీడియా సమావేశంలో మార్కాపురం పట్టణ, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శివాలయంలో అవగాహన సదస్సు నిర్వహించిన సీఐ మల్లికార్జున



(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 26)

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్, విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాల్లో భాగంగా కంభం సీఐ మల్లికార్జున ఆదివారం రావిపాడు గ్రామంలోని శివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన ఆరు సీసీ కెమెరాలను పరిశీలించి, ఆలయ భద్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, ఆలయాల్లో జరిగే చోరీలు, ఇతర నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. గ్రామస్తులు పోలీసు శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను అభినందిస్తూ, పోలీసులకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## వైస్సార్సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కాటి జాన్ బెన్ని



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 26)

కేంద్ర కార్యాలయం ప్రకటించిన పలు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శి పదవులలో పొదిలి ప్రకాష్ నగర్‌కి చెందిన కాటి జాన్ బెన్ని కి క్రిష్టియన్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా తన పై నమ్మకం ఉంచి జిల్లా స్థాయి పదవీ దక్కేలా సహకారం అందించిన వైస్సార్సీపీ మార్కాపురం ఇంచార్జ్ అన్నా రాంబాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కేవీ రమణారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గోలమారి చెన్నారెడ్డి, షేక్ నూర్జహాన్, పొదిలి మండల, పట్టణ వైస్సార్సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలియచేశారు. రాబోయే ఎన్నికలలో వైస్సార్సీపీ గెలుపుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తానని తెలిపిన జాన్ బెన్ని.

## నేడు గరిక తొక్కుడు పండుగకు పోలీసుల బందోబస్తు కంభం చెరువు కట్టను పరిశీలించిన ఎస్ఐ శివకృష్ణారెడ్డి





(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 26)

కంభం చెరువు వద్ద హజ్రత్ దానేషావలి దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించనున్న సాంప్రదాయ "గరిక తొక్కుడు" కార్యక్రమం నేపథ్యంలో కంభం ఎస్ఐ శివకృష్ణారెడ్డి ఆదివారం చెరువు కట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పండుగకు వచ్చే భక్తుల రద్దీ, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. గరిక తొక్కుడు కార్యక్రమానికి సుమారు 3 వేల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా కొత్తగా వివాహమైన జంటలు గరిక తొక్కితే వారి దాంపత్య జీవితం పచ్చగా, సుఖసంతోషాలతో కొనసాగుతుందనే విశ్వాసంతో పెద్ద సంఖ్యలో చెరువు కట్టకు చేరుకుని తమ వివాహ హారాలను కంభం చెరువులో నిమజ్జనం చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని తెలిపారు. పండుగను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు పోలీసులకు సహకరించి ప్రశాంతంగా దర్శనాలు చేసుకోవాలని కంభం ఎస్ఐ శివకృష్ణారెడ్డి కోరారు.

## ప్రజలకు ఉపయోగపడని ఆరోగ్య ఉప కేంద్రం

### ఎప్పుడు వస్తారో... ఎప్పుడు వెళ్ళుతారో తెలియని కొలుకుల ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బంది




(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జులై 26)

మండలంలోని కొలుకుల ఆరోగ్య ఉప కేంద్రం ఎప్పుడు మూసివేయబడి ఉంటుందని ఈ ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో ఉన్న గ్రామ ప్రజలుకు ఆరోగ్య సేవలు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ ఆరోగ్య ఉప కేంద్రం పాలుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కొలుకుల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఈ ఉప ఆరోగ్య కేంద్రం. ఈ ఆరోగ్య ఉప కేంద్రంలో ఒక ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఐదుగురు ఆశా వర్కర్లు, సిబ్బంది ఉండేవారు. ఈ ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో కొలుకుల చిన్న కొలుకుల చెన్నారాయునిపల్లి గ్రామాల్లో ఉండేవి. గతంలో ఉన్న అధికారులు ఇక్కడ నుండి బదిలీ అయ్యి వెళ్లిపోయారని సమాచారం. కొత్తగా వచ్చిన అధికారులు ఎప్పుడు వస్తారో.... ఎప్పుడు వెళ్తారో తెలియడం లేదని మూడు గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోగ్య కేంద్రానికి వచ్చి చూసి ఎప్పుడు మూసి వేయబడుతుందని రోగులు వచ్చి చూసి వెళ్ళిపోతున్నారు. కొత్తగా వచ్చిన అధికారులు ఎప్పుడు వస్తారో.....ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితిలో ఉన్నామని గ్రామ ప్రజలు వాపోతున్నారు. మూడు గ్రామాలలో ఉన్న కొంతమంది బిపి, షుగర్, ఇతర వ్యాధులకు మందుల కోసం ఆరోగ్య ఉప కేంద్రానికి ఎప్పుడు వచ్చినా ఆరోగ్య ఉప కేంద్రం మూసివేయబడి ఉంటుందన్నారు. సకాలంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని తెరిచి ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బంది వచ్చి ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని గ్రామ ప్రజలు తెలిపారు. ఈ విషయం పై పాలుట్ల ఆరోగ్య కేంద్రం డాక్టర్ కోటా నాయక్‌ను షణ్ముఖ వెలుగు ప్రతినిధి వివరణ కోరగా సోమవారం నుండి ఆరోగ్య ఉప కేంద్రంలో అందరు సిబ్బంది అందుబాటులో ఉంటారని రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తారని తెలిపారు.

## నిత్య యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



**రాష్ట్రస్థాయి యోగాపోటీలకు ప్రకాశం జిల్లా విద్యార్థుల ఎంపిక**
**ఉత్సాహంతో విద్యార్థుల యోగసన ప్రదర్శన**
**ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో యోగ విజేతలకు 3 శాతం రిజర్వేషన్**
**పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ పంపిణీ చేసిన పోతినేని శ్రీనివాసరావు**





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 26)

ప్రకాశం జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరవ జిల్లా స్థాయి యోగాసన పోటీలు జులై 26వ తేదీ ఆదివారం స్థానిక ఆంధ్ర కేసరి విద్యా కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ పోటీలు మూడు విభాగాలలో జరుగుగా మొత్తం 80 మందికి పైగా విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. అద్భుతంగా యోగాసనాలను ప్రదర్శించారు. ప్రకాశం జిల్లా అధ్యక్షులు బోయపాటి రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర యోగానా అసోసియేషన్ ఉపాధ్యక్షులు గంధవళ్ల బాలసుబ్రమణ్యం, ముఖ్య అతిధులుగా బీజేపీ రాష్ట్ర ఆల్ సెల్స్ కో కన్వీనర్, క్విస్ కళాశాల చైర్మన్ నిడమానూరి కళ్యాణ చక్రవర్తి, పి ఎస్ ఆర్ కన్స్ట్రక్షన్ అధినేత పోతినేని శ్రీనివాసరావు (పి.ఎస్.ఆర్), స్విమ్స్ వైద్యశాల వైద్యులు డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు, కోటీస్ షాపింగ్ మాల్ నిర్వాహకులు నల్లమల్లి కోటి సూర్యనారాయణ, ఆయుష్ జిల్లా అధికారి డాక్టర్ భీమనాథ్ విచ్చేశారు. సభ ప్రారంభమునకు ముందుగా అతిధులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జిల్లా నలుమూలల నుండి ఉత్సాహముగ విచ్చేసిన విద్యార్థులు తమతమ విభాగాలలో యోగాసనాలను ప్రదర్శించారు. సాయంత్రం బహుమతి ప్రదానోత్సవానికి పి ఎస్ ఆర్ కన్స్ట్రక్షన్ అధినేత పోతినేని శ్రీనివాసరావు, ఎయిమ్స్ డాక్టర్ బొమ్మల రామలింగేశ్వరరావు, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారిణి రాజ రాజేశ్వరి, ఆంధ్రకేసరి కళాశాల చైర్మన్ మండువ నాగేశ్వరరావు విచ్చేశారు. విజేతలకు బహుమతులు అందచేశారు. ఆర్టిస్టిక్ సోలో యోగా పోటీలలో సబ్ జూనియర్ విభాగములో బాలికలు ఎల్ శృతి, జూనియర్ బాలికలు ఏం హరిణి, ట్రెడిషనల్ సబ్ జూనియర్ విభాగంలో బాలికలు ఏం శృతి, బాలురు రేవంత్ సాయి, జూనియర్ బాలికలు యమున, బాలురు జి రోహిత్, సీనియర్ విభాగంలో సుశాల, ప్రీతి, జి ఆషా జ్యోతి, బాల కోటేశ్వరి, టి. వెంకట ప్రసన్న, బాలురు ఆదిత్య, ఆర్ తేజ, ఎస్‌వి రమణయ్య, వి ఈశ్వరయ్య, ఆర్టిస్టిక్ పెయిర్ సబ్ జూనియర్ బాలురు పి మహేంద్ర, ఎస్ శామ్యూల్ కుమార్. జూనియర్ బాలికలు ఎం హరిని, ఎల్ యమున. పి సుస్మిత కే శ్రీ వల్లి, సీనియర్ యు సుశీల జూనియర్ బాలురు రోహిత్, రిథమిక్ పెయిర్ సబ్ జూనియర్ బాలురు అజయ్ కుమార్ అప్సర్, బాలికలు బి జాహ్నవి కే మధుర, జూనియర్ ఎల్ యమునా, ఎం హరిణి. సీనియర్ బాలురు ఏ ఎస్ ఆదిత్య రామ్, జి కార్తీక్. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు యోగాచార్య గంధవళ్ళ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ యోగాసనాలను ఆధ్యాత్మిక భావనతో చేసేవారన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ చొరవతో యోగాసనాలను క్రీడగా ఒలంపిక్స్ పోటీలలో ప్రవేశ పెట్టారన్నారు. ఆయా పోటీలలో పాల్గొనే పోటీదారుల ఎంపిక ఇప్పుడు జిల్లా స్థాయిలో జరుగుతుందన్నారు. జిల్లా పోటీలలో విజేతలైన వారిని రాష్ట్ర పోటీలకు అక్కడ విజయం సాధించిన వారిని జాతీయ స్థాయి, అలాగే ఒలంపిక్స్ కు పంపడం జరుగుతుందని వివరించారు. యోగాసన పోటీలలో గెలుపొందిన వారికి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో 3 శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. అతిథులు మాట్లాడుచూ యోగ అనేది ప్రాచీన భారతీయ కళ అని, శారీరక మానసిక సమతుల్యతకు యోగ సాధన దోహదపడతాయని, యోగ ప్రచారము కొరకు యోగా డే ఏర్పాటుచేయడంతో ప్రపంచ దేశాల్లో యోగాని ప్రతినిత్యం సాధన చేస్తున్నారని తెలిపారు. అందరి ఆరోగ్యానికి, ఆనందమయ జీవితానికి యోగాను క్రీడగ గుర్తించి అందరికీ ఉపయుక్తం అయ్యేటట్లు చేస్తున్న యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ కృషిని అభినందించారు. సంస్థ గౌరవ సభ్యులు చలువాది బద్రి నారాయణ, శ్రీరాం (లీలా కృష్ణా) రమేష్, అధ్యక్షులు బోయపాటి రవి, కార్యదర్శి సోమ సుబ్బారావు, ఉపాధ్యక్షులు వి సుధీర్, ఎన్ దేవకుమారి, కే వి శేషారావు, కే హరి కృష్ణ, కోశాధికారి వేమూరి చక్రధర పెరుమాళ్ళు, రాధా రమణ గుప్తా జంధ్యం, చిలకల శివకుమార్, పి శంకర్ నారాయణ, దేసు వెంకయ్య, ధనిశెట్టి రామానాయుడు, షేక్ ఇమాంసా, పి జవహర్, సినిగేపల్లి కిషోర్, తదితరులు కార్యనిర్వహణ చేశారు.







# అసాంఘిక కార్యకలాపాల పై ఉక్కుపాదం

**ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేసిన ప్రకాశం జిల్లా పోలీసులు**

**పేకాట ఆడుతున్న స్థావరం పై ఒంగోలు టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి**

**10 మందిని అదుపులోకి తీసుకుని**

**రూ.40,230 నగదు, పది సెల్ ఫోన్లు స్వాధీనం**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 26)**

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాల పై ఒంగోలు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. కొత్తపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని మదనూరు గ్రామల శివారులో ఆదివారం పేకాట స్ధావరం పై టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ మరిది నాయుడు, సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.40,230 నగదు, 10 మొబైల్ ఫోన్లును స్వాధీనం చేసుకున్నారు. వారి పై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు నిమిత్తం కొత్తపట్నం పోలీస్ స్టేషన్లో టాస్కోఫ్ర్స్ పోలీసులు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, జూద క్రీడలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

# ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో విద్యుత్ బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్

**రూ.2.10 కోట్ల బకాయిల వసూలే లక్ష్యం**

**29న ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయి పరిశీలన**

**బిల్లు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ల తొలగింపు**

**సబ్ డివిజన్ అధికారి శ్రీకాంత్ ప్రకటన**



**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జూలై 26)**

మైదుకూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో దీర్ఘకాలంగా బకాయిపడ్డ విద్యుత్ బిల్లుల వసూలు కోసం రేపటి జూలై 27నుంచి ఈ నెల చివరి వరకు ప్రత్యేక కార్యాచరణ నిర్వహిస్తున్నట్లు సబ్ డివిజనల్ అధికారి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని దువ్వూరు, చాపాడు, ఖాజీపేట, మైదుకూరు, వనిపెంట సెక్షన్లలో ఉన్న ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల నుంచి మొత్తం రూ.2 కోట్ల 10 లక్షలు విద్యుత్ బకాయిలు రావాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

**మండలాల వారీగా బకాయిలు :**

ఖాజీపేట మండలం రూ. 60 లక్షలు, చాపాడు మండలం రూ. 50 లక్షలు, దువ్వూరు మండలం రూ. 50 లక్షలు, మైదుకూరు మండలం రూ.50 లక్షలు. ముఖ్యంగా జూలై 29 (బుధవారం) ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బంది అందరినీ రెండు ప్రత్యేక గ్రూపులుగా విభజించి, ఎక్కువ బకాయిలు ఉన్న కాలనీల్లో నేరుగా వసూలు కార్యక్రమం చేపడతారని వెల్లడించారు.

# విలీన గ్రామాలను పక్కనపెట్టి, మున్సిపల్ ఎన్నికలకు వెళదామా?

**వైసీపీ నేతలకు ఎమ్మెల్యే ఇంటూరి సవాల్**

**ఎన్నికలు జరిగితే మా సత్తా ఏంటో చూపిస్తాం**

**కందుకూరు ప్రజల్ని ఎంతకాలం మోసం చేస్తారు?**

**వైసిపి అసత్య ప్రచారాల పై మండిపడ్డ ఎమ్మెల్యే**

**రెండేళ్ల పాలన - ఇంటింటి ప్రచారం పై కూటమి శ్రేణులకు అవగాహన**

**అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపు**




**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూలై 26)**

కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు జరగకుండా కోర్టులో కేసు వేసిన వ్యక్తి దగ్గరకి మధ్యవర్తిత్వం పంపిన మాట వాస్తవమే. అభివృద్ధి కోణంలోనే అలా చేశాను. ఎన్నికలు జరిగితే ఏటా రూ.4 కోట్ల నిధులు వచ్చేవి. మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెంది ఉండేది. కానీ కోర్టు కేసుల కారణంగా ఎన్నికలతో పాటు అభివృద్ధి కూడా నిలిచిపోయింది. మంచి ఆలోచనతో నేను రాయబారం పంపిస్తే వైసీపీ నేతలు తన మాటలను వక్రీకరించి అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. వైసీపీ నేతలకు ఇదే తన సవాల్. మొత్తం 32 వార్డులకు గాను, విలీన గ్రామాలన్నీ 3 వార్డుల్లోనే ఉన్నాయి. మిగిలిన 29 వార్డుల ప్రాతిపదికన మున్సిపల్ ఎన్నికలకు వెళదామా ? ఎవరి సత్తా ఏంటో తేల్చుకుందామా? ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఏకపక్షంగా గెలుపు మాదే. 12 ఏళ్ల నుంచి మున్సిపాలిటీ ఎన్నికలు నిలిచిపోయాయి. ఎవరు కేసులు వేయించారో, ఏ దురుద్దేశంతో ఎన్నికలు జరగకుండా కుట్ర చేశారో ప్రజలకు బాగా తెలుసు. ఈ మోసానికి వైసీపీ నేతలు ప్రజలకు సమాధానం చెప్పి తీరాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వైసిపి నేతల పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కందుకూరు మున్సిపాలిటీలోనే కాదు నియోజకవర్గంలోని 92 పంచాయితీల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిస్తాం. ఈ రెండేళ్లలో కూటమి ప్రభుత్వం భారీ స్థాయిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే మమ్మల్ని గెలిపిస్తాయని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు.

**సోమవారం నుంచి ప్రజల్లోకి....**

రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం ద్వారా సోమవారం నుంచి 45 రోజుల పాటు కూటమి పార్టీల నేతలు అందరూ ఇంటింటి ప్రచారంలో పాల్గొనాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండల, గ్రామ, వార్డు అధ్యక్షులు.. క్లస్టర్ యూనిట్ మరియు బూత్ ఇన్చార్జిలు... ప్రతిరోజు 30 ఇళ్లకు వెళ్లి, కరపత్రాలు అందించడంతోపాటు పథకాల గురించి వివరించాలని సూచించారు. అలాగే మై టిడిపి యాప్ లో కూడా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంపై నేతలకు అవగాహన కల్పించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ ఈ రెండేళ్లలో నెరవేర్చాం. ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, స్త్రీ శక్తి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మత్స్యకార భరోసా, అన్నదాత సుఖీభవ, ముఖ్యమంత్రి సహాయ నిధి, నేతన్న సేవలో, ఆటో డ్రైవర్ సేవలో, ఎన్టీఆర్ వైద్య సేవ... లాంటి పథకాలన్నీ ప్రజలకు విస్తృతంగా ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. కందుకూరు నియోజకవర్గంలో ఈ రెండేళ్ల కాలంలో 660 కోట్లతో అభివృద్ధి, 1260 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు జరిగాయని ఎమ్మెల్యే వివరించారు. చెప్పిన దానికంటే ప్రజలకు చాలా ఎక్కువ చేస్తున్నామని, అవన్నీ చెప్పుకోవాల్సిన బాధ్యత నేతలపై ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఏ పార్టీలోనైనా విభేదాలు, అసంతృప్తులు సహజం. కానీ మంచి చేసే నాయకుడి వెనకే ప్రజలు ఉంటారని గుర్తుంచుకోండి. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలు తీర్చేందుకు కృషి చేయండి. నాయకులంతా ఐకమత్యంతో ప్రజల్లోకి వెళ్లాలి... అని ఎమ్మెల్యే సూచించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు బ్రహ్మాండంగా పరిపాలిస్తున్నారు. ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో రాష్ట్రం దూసుకుపోతోంది. హార్టికల్చర్ హబ్ ద్వారా త్వరలో కందుకూరు నియోజకవర్గానికి 30 నుంచి 40 కోట్ల రూపాయల నిధులు రాబోతున్నాయి... అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహం, దాంట్లో నియోజకవర్గం బిజెపి కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, జనసేన నాయకులు మదన్, టీడీపీ సీనియర్ నాయకులు కంద్రా మాల్యాద్రి, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీను, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర కమిటీ నాయకులు బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, నాదెళ్ల రమణయ్య, పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, పార్లమెంట్ కమిటీ సభ్యులు చదలవాడ కొండయ్య, షేక్ రూబీ, మద్దసాని మహేంద్ర, దార్ల ఎలమందమ్మ, నియోజకవర్గ కమిటీల నాయకులు కల్లూరి శైలజ, ముచ్చు శ్రీను, అల్లం వెంకటేశ్వర్లు, షేక్ నాయబ్ రసూల్, షేక్ మున్నా, పొడపాటి మహేష్, పూరిమిట్ల మాల్యాద్రి, క్లస్టర్ ఇన్చార్జులు కాకుమాని హర్ష, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, వంకాయలపాటి మాల్యాద్రి, వడ్డేళ్ళ రవిచంద్ర, బొద్దులూరి కొండలరావు, గొంది నరసింగరావు, చిత్తారు మల్లికార్జున, ఉమ్మనేని సుబ్బారావు, బెల్లం కృష్ణమోహన్, పోలుబోయిన శ్రీను, వాసు, పలు కమిటీల నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



# కిడ్నాపర్‌ని అరెస్టు చేయని ఉలవపాడు ఎస్ఐను సస్పెండ్ చేయాలి

**పేకాట, మద్యం తాగే వారిని అరెస్టు చేయటానికి ఉపయోగించే**

**ఇండోసోల్ డ్రోన్‌ని కిడ్నాపర్ పాలకీర్తిని అరెస్టు చేయటానికి ఉపయోగించాలి**

**ఉలవపాడు పోలీస్ స్టేషన్ ముందు**

**బాధితులతో కలసి దళిత నేత నీలం డిమాండ్**




**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 26)**

మాదిగ కులానికి చెందిన మైనర్ బాలిక 55 రోజులైన ఆచూకీ కనుగొనక కిడ్నాపర్‌కి గొడుగు పడుతున్న ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావును సస్పెండ్ చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నేను నాగేంద్రరావు బాధితుల తల్లిదండ్రులతో కలసి డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం కిడ్నాప్ గురైన బాలిక తల్లిదండ్రులతో కలిసి ఉలవపాడు పోలీస్ స్టేషన్ కు వచ్చారు కానీ స్టేషన్ లో ఉన్న ఎస్ఐ సుబ్బారావు బాధితుల లను కలవడానికి ఇష్టపడలేదు,అంతట దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేందర్రావు కందుకూరు సిఐ అన్వర్ బాషాతో మైనర్ బాలిక కిడ్నాప్ విషయమై ఉలవపాడు ఎస్ఐ కాలయాపన వైఖరి పై ఫోన్లో మాట్లాడారు. కిడ్నాప్ కు గురైన బాలిక ఏలూరు పరిసర ప్రాంతాలలో ఉన్నదని వారు ఫోను వాడటం లేదని తమ ఎస్ఐ ఆ పని మీదనే కిడ్నాపర్ ను పట్టుకోవడానికి పట్టుకునే పనిలో ఉన్నాడని చెప్పాడు. అంతట నీలం నాగేంద్రరావు ఆగస్టు 6వ తేదీతో కిడ్నాప్ గురైన బాలిక మేజర్ అవుతుందని, ఉలవపాడు ఎస్ఐ కిడ్నాపర్‌ను పట్టుకునే ఉద్దేశమే లేదని, కాలయాపన చేస్తూ కిడ్నాపర్‌ని రక్షిస్తున్నాడని అన్నాడు. మైనర్ బాలిక స్వచ్ఛందంగా మేజర్‌తో వెళ్లిన తల్లి ఫిర్యాదు చేస్తే కిడ్నాప్ కేసు కట్టాలి. కానీ బాలిక మిస్సింగ్ కేసుగా ఉలవపాడు ఎస్ఐ ఎలా కడతారని నీలం కందుకూరు సిఐని ప్రశ్నించారు. 50 రోజుల తర్వాత హైకోర్టులో హేభియస్ కార్పస్ పిటిషన్ వేస్తే అప్పుడు మాత్రమే కిడ్నాప్ కేసుగా మార్చారని, మైనర్ బాలికను వారి తల్లిదండ్రులకు అప్పగించే ఉద్దేశం ఉలవపాడు ఎస్ఐకు లేదని, కిడ్నాప్ ఆచూకీ సుబ్బారావుకు తెలుసని అన్నారు. అంతట ఉలవపాడు పోలీస్ స్టేషన్ ముందు బాలిక తల్లిదండ్రులు రోదియా తదితరులతో కలసి మైనర్ బాలిక కిడ్నాప్ అయి 55 రోజులైనా ఆచూకీ కనుగొనని ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావును సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలోనే ప్రత్యేక పోలీసు బృందాలు మాదిగ కులానికి చెందిన మర్లపాటి రోదియా మైనర్ బాలిక 55 రోజులు అయినా ఆచూకీ కనుగొనలేదన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బంధువులను అవమానించి, వేధించారన్నారు. కందుకూరు సిఐ, డిఎస్పి లకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదన్నారు. ఇటీవలే ఉలవపాడు పోలీస్ స్టేషన్‌కు ఇండోసోల్ కంపెనీ వారు ఇచ్చిన డ్రోన్ లను పేకాట ఆడేవారిని, మద్యం తాగే వారిని పట్టుకోడానికి పరిమితం చేయకుండా పాలకీర్తి వెంకట్రావు లాంటి కిడ్నాపర్ ను అరెస్టు చేయడానికి ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలిక తల్లిదండ్రులతో పాటు మాల మహానాడు అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, మేడికొండ మురళి, తదితరులు ఉన్నారు.

# బోనస్, వడ్డీ లేని రుణం ఇచ్చే ఆలోచనను తిరస్కరించండి

**29న జాతీయ రహదారి దిగ్బంధనంలో వేలాదిగా పాల్గొనండి**

**సంయుక్త కిసాన్ మోర్చా**

**జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపు**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 26)**

కనీస ధర సగటున క్వింటాకు రూ.25వేలు సరాసరి ధర దక్కేలా ప్రభుత్వాలు రూ. 1000 కోట్లు నిధులు కేటాయించి, ప్రభుత్వ రంగ సంస్థలచే పొగాకు కొనుగోలు చేయించాలని సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయితే కేజీకి 20 రూపాయలు బోన్స్ ఇస్తామని, వడ్డీ లేని రుణం 60000 ఇస్తామని ఆలోచన చేస్తున్నట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వస్తున్న వార్తలను తిరస్కరించి, గిట్టుబాటు ధరల కోసం ఈనెల 29న టంగుటూరు టోల్ ప్లాజా వద్ద జరిగే జాతీయ రహదారి దిగ్బంధనం కార్యక్రమంలో వేలాది మంది రైతులు పాల్గొని, తమ కోరికలను పాలకలోకు తెలపాలని రంగారావు పిలుపునిచ్చారు. రైతు చైతన్య బైక్ ర్యాలీ ఆదివారం లింగసముద్రం మండలానికి వచ్చిన సందర్భంగా జరిగిన రైతుల సమావేశంలో రంగారావు మాట్లాడారు. బ్యారన్ కు రూ. ఐదు నుండి 6 లక్షల రూపాయల నష్టం వస్తుంటే కిలోకు 20 రూపాయలు బోనసి ఇస్తే రైతులు ఏ విధంగా అప్పుల ఊబి నుండి బయటపడగలుగుతారని ప్రశ్నించారు. పొగాకు నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఏడాదికి 80 వేల కోట్ల రూపాయలు వస్తుంటే, ఆ డబ్బు నువ్వు కార్పొరేట్లకు దోచి పెడుతూ, పొగాకు రైతులు మాత్రం పొగాకు వ్యాపారుల దోపిడీకి బలి చేస్తున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జయంతి బాబు, హనుమారెడ్డి అన్నారు. ఈనెల 23వ తేదీ నుండి ప్రారంభమైన రైతు చైతన్య యాత్ర ఆదివారం వలేటివారిపాలెం నుండి బయలుదేరి, లింగసముద్రం మండలం, కందుకూరు మండలాల్లో ని గ్రామాల్లో పర్యటించింది. ఈ యాత్రలో రైతు సంఘం నాయకులు కమిటీ వెంకట్రావు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు సి ఎస్ సాగర్, పరిటాల కోటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు శ్రీకాంత్, మాదాల రమణయ్య, కుమార్, చెరుకూరి వాసు, పొగాకు పోటు రీజియన్ కమిటీ మెంబర్ తాటికొండ రమణయ్య, వి రామకృష్ణ, నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కామినేని శ్రీనివాసులు, నోటి వెంకటేశ్వర రెడ్డి, కోనూరు వెంకటేశ్వర్లు, మోదేపల్లి రవి, ధామ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# కనిగిరి క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తాం

## క్లబ్ అభివృద్ధికి రూ.25 లక్షల - సొంత నిధులు ఇవ్వనున్న అధ్యక్షులు




**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 26)**

కనిగిరి కాస్మోపాలిటన్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని క్లబ్ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు నీలిశెట్టి సుబ్బారావు, సానికొమ్ము తిరుపతిరెడ్డిలు అన్నారు. స్థానిక క్లబ్ ఆవరణలో ఆదివారం రాత్రి నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సభకు ఎన్నికల పరిశీలకులు ప్రకాశరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఉపాధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఎంతో ఘనమైన చరిత్ర ఉన్న కనిగిరి కాస్మోపాలిటన్ క్లబ్‌ను గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో క్లబ్ ఎన్నికలు లేకుండా సభ్యులందరి సమ్మతితో ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని ఎన్నుకోవడం ఆనందదాయకమన్నారు. కనిగిరిలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సహకారంతో క్లబ్‌లో కూడా సమూల మార్పులు చేపట్టనున్నట్లు ఎస్‌టిఆర్ తెలిపారు. క్లబ్ మాజీ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మేధావులు ఉండే కనిగిరి కాస్మోపాలిటన్ క్లబ్ నిర్వహణ ఆషామాషీ కాదన్నారు. సభ్యులందరి సలహాలు, సూచనలు పాటిస్తూ క్లబ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. నూతన పాలకవర్గం కూడా మరింత ఉత్సాహంతో సభ్యుల సూచనలతో క్లబ్‌ను మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. క్లబ్ సీనియర్ సభ్యులు, ఎన్నికల పరిశీలకులు ప్రకాశరావు మాట్లాడుతూ నూతన అధ్యక్షులు నీలిశెట్టి సుబ్బారావు క్లబ్ అభివృద్ధికి తన సొంత నిధులు రూ.25 లక్షలు ఇస్తాననడం ఆనందదాయకమన్నారు. పట్టణ నడిబొడ్డున ఉండే క్లబ్ రూపురేఖలు మార్చేలా నూతన పాలకవర్గం పని చేయాలన్నారు. పాతపాలకవర్గానికి వీడ్కోలు పలికిన అనంతరం నూతన పాలకవర్గం అధ్యక్షులు నీలిశెట్టి సుబ్బారావు, ఉపాధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చిన్ని, మిగిలిన పాలకవర్గ సభ్యులు, ఎన్నికల పరిశీలకులు ప్రకాశరావు, మూర్తయ్య, బాలకృష్ణలు ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని పాతపాలకవర్గ సభ్యులు సన్మానించగా అనంతరం పట్టణ ప్రముఖులు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ధనుంజయుడు, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ రమా శ్రీనివాస్, పల్లాల నారపరెడ్డి, చెంచిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.






## శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణిమ







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 26)**

కందుకూరులోని కోవూరు రోడ్డులో గల శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణిమ ఉత్సవాలలో భాగంగా దేవాలయ కమిటీ ఆహ్వానం మేరకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం సాయంత్రం హాజరయ్యారు. అనంతరం సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు పువ్వాడి రమేష్, మాదాల నరసింగరావు, మచ్చా ప్రసాదు, తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## ఎల్‌నినో పరిస్థితుల్లో పీఎండీఎస్ సీడ్ పెల్లెటైజేషన్ ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా చేపట్టాలి

### ఈవీసీ టి విజయ్‌కుమార్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 26)**

ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రకృతి వ్యవసాయంలో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో సీడ్ పెల్లెటైజేషన్ చేసి పప్పుధాన్యాలు, పశు గ్రాస పంటలను విస్తృతంగా సాగు చేయాలని రైతు సాధికార సంస్థ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (వ్యవసాయ శాఖ) రాజశేఖర్,




వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల అధికారులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ప్రకాశం జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఓ సుభాషిణి ఆధ్వర్యంలో డీపీఎంయూ సిబ్బంది, ఎఫ్‌ఎమ్‌టీలతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ పీఎండీఎస్ సీడ్ పెల్లెటైజేషన్ ద్వారా తక్కువ తేమ ఉన్న పరిస్థితుల్లో కూడా విత్తనాల మొలక శాతం పెరిగి, పంటల నిలకడ మెరుగుపడుతుందని తెలిపారు. ముఖ్యంగా పప్పుధాన్యాలు, పశుగ్రాస పంటలను సాగు చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయంతో పాటు పశువులకు అవసరమైన మేత కూడా లభిస్తుందని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవడానికి ఈ విధానం సమర్థవంతమైన పరిష్కారమని ఆయన వివరించారు. అనంతరం జిల్లా డీపీఎం ఓ సుభాషిణి మాట్లాడుతూ పీఎండీఎస్ సీడ్ పెల్లెటైజేషన్ విధానం, దాని ప్రయోజనాలు, ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. గ్రామస్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. అదేవిధంగా సమావేశంలో ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాసులు పాల్గొని ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం గురించి ఎఫ్‌ఎమ్‌టీలకు అవగాహన కల్పించారు. రైతులు పండించిన పంటలను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చేందుకు ఆహార శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే సబ్సిడీలను వినియోగించుకోవాలని సూచించారు. రైతులు తమ ఉత్పత్తులకు విలువ జోడించి స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## 200 మందికి ఉచిత వైద్య సేవలు

# విజయవంతమైన అమర్ హాస్పిటల్ వైద్య శిబిరం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 26)**

దాసరి జాలమ్మ 12వ వర్ధంతి సందర్భంగా దాసరి పోలయ్య, ఒంగోలు అమర్ హాస్పిటల్స్, అగర్వాల్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరు గ్రామం నందు ఉచిత వైద్య శిబిరం ఆదివారం 1వ సచివాలయం నందు నిర్వహించారు. ఈ శిబిరంలో షుగరు, బీపీ, ఈసిజి, ఎముకల పటుత్వ, ఫుట్ స్క్రీనింగ్ పరీక్షలు, కంటి పరీక్షలు ఉచితం గా నిర్వహించి, అవసరమైన వారికి ఉచితం గా మందులు అంద చేసినట్లు నిర్వాహకులు దాసరి పోలయ్య తెలిపారు. ఈ శిబిరంలో సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ రమేష్, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ అమర్నాథ్ రెడ్డి, సాధారణ శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ దివ్య యాగంటి, కంటి వైద్య నిపుణులు తో పాటు నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారని, అల్లూరు గ్రామస్థులు, పరిసర ప్రాంత ప్రజలు 200 మందికి పైగా ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొన్నారని అమర్ హాస్పిటల్ ప్రతినిధి మణికంఠ తెలిపారు.







# చేనేత కార్మికుల సంక్షేమానికి, హక్కుల సాధనకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ప్రగడ కోటయ్య

## జిల్లా రెవెన్యూ అధికారి పి వెంకటరమణ





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)**

చేనేత కార్మికుల సంక్షేమానికి, హక్కుల సాధనకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ప్రగడ కోటయ్య అని జిల్లా రెవిన్యూ అధికారి పి వెంకట రమణ అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలు నందు ప్రసిద్ధ ప్రజా నాయకుడు, 'ప్రజాబంధు' స్వర్గీయ ప్రగడ కోటయ్య 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి పి వెంకట రమణ ముఖ్య అతిథిగా హాజరై ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి భావపూర్వక నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి పి వెంకట రమణ మాట్లాడుతూ ప్రగడ కోటయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా చేనేత రంగానికి, నిరుపేద చేనేత కార్మికుల సంక్షేమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. 1915 జూలై 26న జన్మించిన కోటయ్య ,తన జీవితాంతం చేనేత వర్గాల హక్కుల సాధనకే అంకితం చేశారని తెలిపారు. 1952 నుండి 1962 వరకు ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభ్యునిగా, అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యునిగా , రాజ్యసభ సభ్యునిగా సుదీర్ఘకాలం ప్రజాప్రతినిధిగా సేవాలందించిన విషయాన్ని గుర్తుచేశారు. శాసనసభలోనూ, పార్లమెంట్‌లోనూ చేనేత రంగానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, మగ్గాలకు ఉచిత విద్యుత్, సబ్సిడీల సాధన కోసం ఆయన నిరంతరం గళమెత్తారని వివరించారు. సహకార రంగాన్ని బలోపేతం చేయడంలో 'ఆప్కో' స్థాపనలో ప్రగడ కోటయ్య అత్యంత కీలక పాత్ర పోషించారని డీఆర్ఓ తెలియజేశారు. సుమారు 16,000 ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయించడంతో పాటు, చేనేత కార్మికుల సంక్షేమానికై ప్రత్యేక నిధి, బదులు భూ వసతి మరియు విద్యుత్ మగ్గాల నియంత్రణ చట్టం తెచ్చేలా ప్రభుత్వాన్ని ఒప్పించిన ధీశాలి అని ప్రశంసించారు. కేవలం రాజకీయం, కార్మిక సంక్షేమమే కాకుండా విద్యాభివృద్ధికి కూడా ఆయన విశేష కృషి చేశారని, చీరాలలో ఆంధ్ర కేసరి ప్రకాశం జూనియర్ కళాశాల మరియు ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించి వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేశారని పేర్కొన్నారు. 75 ఏళ్లకు పైగా సుదీర్ఘ ప్రజాజీవితంలో ఆయన అందించిన అసమాన సేవలకు గాను ప్రజలు ఆప్యాయంగా ఆయనను 'ప్రజాబంధు' అని పిలుచుకున్నారని, ఆయన చూపిన బాట, ఆశయాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎడి బి రామయ్య, డిఓ ఎ వెంకటేశ్వర్లు, ఎడిఓ టి వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ సిబ్బంది, చేనేత విభాగాధికారులు, వివిధ వర్గాల ప్రముఖులు పాల్గొని ప్రగడ కోటయ్య సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.

# మాజీ ఉప సర్పంచ్ కొల్లా సురేష్ బాబు మృతి పై ఎమ్మెల్యే ఏలూరి సంతాపం



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 26)**

నాగులపాలెం గ్రామ మాజీ ఉప సర్పంచ్ కొల్లా సురేష్ బాబు అకాల మరణం పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సురేష్ బాబు మృతి తెలుగుదేశం పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి సురేష్ సేవలను ఎమ్మెల్యే ఏలూరి కొనియాడారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొల్లా సురేష్‌బాబు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పేకాట స్థావరం పై దాడి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 26)**

ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని కరవాది పంచాయతీ పానకాలపాలెం గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం సమయంలో పేకాట స్థావరం పై టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ మరిది నాయుడు, వారి సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 5 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.3,200 నగదు, 3 మొబైల్ ఫోన్లును స్వాధీనం చేసుకున్నారు. వారి పై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు నిమిత్తం ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్పగించారు.

# ఎల్ఈడి లైట్ల వల్ల జరిగే ప్రమాదాల పై అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 26)**

వాహనదారులు అధిక లైటింగ్ కోసం వాహనాలకు ఎల్ఈడి లైట్లు బిగించడం జరుగుతుంది. అయితే వాటి వల్ల ఎదుట వచ్చే వాహనదారులకు కళ్ళల్లో లైట్లు పడి ఇబ్బంది కలిగి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఒంగోలు ట్రాఫిక్ సీఐ హజరత్తయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది గాంధీ పార్క్ సమీపంలో ఎల్ఈడి లైట్లు వల్ల ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీని పై వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం వాహనాలకు ఉన్న ఎల్ఈడి బల్బులను తొలగించారు. అలాగే ఓల్డ్ మార్కెట్‌లో గుంతలు పడి ప్రమాదకరంగా ఉండడంతో ట్రాఫిక్ సిఐ ఆధ్వర్యంలో మరమ్మత్తులు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ఐ మాల్యాద్రి, ఎస్ఐ కోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# అమరజవాన్ల త్యాగం వెలకట్టలేనిది

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి




**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 26)**

అమరజవాన్ల త్యాగం వెలకట్టలేనిదని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. 27వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఆర్కే గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన 27వ కార్గిల్ దివస్ సందర్భంగా అప్పటి కార్గిల్ యుద్ధంలో అమర వీరులైన కుటుంబాలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ జిల్లా సైనికుల వెల్ఫేర్ భవనం ఇప్పటి వరకు ఒంగోలులో ఉండేదని, త్వరలోనే మార్కాపురం జిల్లాకు సంబంధించిన భవనం మన కలెక్టరేట్ భవన ప్రాంగణంలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ సైనికులు, వారి కుటుంబాలు పాల్గొన్నారు.







# 20 వైసిపి కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరిక

## పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 26)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమక్షంలో మండలంలోని కేతగుడిపి గ్రామ ఎస్సీ పాలెంకు చెందిన మాజీ ఎంపీటీసీ బేతం ఆశీర్వాదం ఆధ్వర్యంలో 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వారందరికీ మెడలో పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి మార్కాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి పార్టీలో చేరుతున్నామన్నారు. పార్టీలో చేరిన వారిలో కేతగుడిపి మాజీ ఎంపీటీసీ బేతం ఆశీర్వాదం, బేతం గురవయ్య, బేతం రూబేను, బేతం రంగయ్య, బేతం బాబు, బేతం వెంకటస్వామి, బేతం వెంకట్, బేతం పీటర్ పాల్, బేతం చిన్న వెంకటస్వామి, బేతం సంతు, బేతం చిన దానియేలు, గుడిమెట్ల డానియల్ బాబు, పి బాబురావు, పి రమేష్ బాబు, టి జానీ, పి విజయ, పి నాగరాజు, పి జాను, పులుకూరి కొండయ్య, పెరికే జెస్టర్ బాబు, పెరికే కిషోర్, బి వెంకటయ్య, బి లక్ష్మయ్య, బి పిచ్చయ్య, బి గురవయ్య, కటికల యెహోను, బేతం మోహన్‌రావు, బేతం బాలయ్య, తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం జిల్లాతో ఈ ప్రాంతంలో రైతులు బాగుపడతారని హార్టికల్చర్ హబ్ ద్వారా ప్రతి రైతు లక్షాధికారిగా మారతారని, సూర్యఘర్ పథకము ద్వారా ప్రతి ఎస్సీలకు గృహాలకు సోలార్ సెట్లను ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. తద్వారా ఒక్క రూపాయి కూడా విద్యుత్ బిల్లు కట్టనవసరం లేదన్నారు. భవిష్యత్తులో ఇది ఒక ఆదాయ వనరుగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# మాయమాటలు నమ్మి మోసపోవద్దు

## ప్రొద్దుటూరు ఏఎస్పీ యు విభూ కృష్ణన్



(షణ్ముఖ వెలుగు, ప్రొద్దుటూరు, జూలై 26)

తక్కువ ధరలకే బంగారం ఇస్తామంటూ మాయమాటలు చెప్పే మోసగాళ్ల వ్యాపారాన్ని ఎవరూ నమ్మవద్దు. కష్టపడి సంపాదించిన సొమ్మును ఇలాంటి దొంగల చేతుల్లో పెట్టి మోసపోకూడదని ప్రొద్దుటూరు ఏఎస్పీ యు విభూకృష్ణన్ ప్రజలను హెచ్చరించారు. తక్కువ ధరకు ఎక్కువ బంగారం తయారు చేసి ఇస్తానంటూ రూ.6.50 లక్షలు కాజేసి, నకిలీ బంగారం అంటగట్టిన కేసులో అంతర్జిల్లా ముద్దాయిని ప్రొద్దుటూరు ఐ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ విభూ కృష్ణన్ కేసు వివరాలను వెల్లడించారు. సమాజంలో అమాయకత్వాన్ని, అవసరాలను ఆసరాగా చేసుకుని ఆయుర్వేదం, తక్కువ ధరకు బంగారం, గుప్తనిధుల పేరుతో మోసాలకు పాల్పడే ముఠాలు తిరుగుతున్నాయి. లక్ష రూపాయలకే 100 గ్రాముల బంగారం ఇస్తామంటే అది కచ్చితంగా మోసమేనని గ్రహించాలి. ఆర్థిక మోసాల పట్ల ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

**మోసం జరిగింది ఇలా :**

ప్రొద్దుటూరు వసంతపేటకు చెందిన ఫోటోగ్రాఫర్ బెల్లాల రవికుమార్ (44) అనారోగ్యంతో బాధపడుతుండగా, అతని స్నేహితుడి ద్వారా తిరుపతి జిల్లా పుత్తూరు మండలం వినాయకపురానికి చెందిన కన్నయ్య అలియాస్ ప్రసాద్ పరిచయమయ్యాడు. తనకు ఆయుర్వేద వైద్యంతో పాటు తక్కువ ధరకు ఎక్కువ బంగారం తయారు చేయడం వచ్చని నమ్మబలికాడు. లక్ష రూపాయిలకే 100 గ్రాముల బంగారం ఇస్తానని చెప్పడంతో రవికుమార్ రూ. 5 లక్షల విలువైన బంగారానికి ఆర్డర్ ఇచ్చి, ఆ తర్వాత ఖర్చుల నిమిత్తం మరో రూ. 1.50 లక్షలు ఇచ్చాడు. మొత్తం రూ.6,50,000 తీసుకున్న నిందితుడు బాధితుడికి నకిలీ బంగారు కడ్డీ ఇచ్చి మోసం చేశాడు.

### సిఐ కొండారెడ్డి పర్యవేక్షణలో కేసు ఛేదన
### అంతర్ జిల్లా మోసగాడు అరెస్ట్
### తక్కువ ధరకు బంగారమంటూ రూ6.50 లక్షల మోసం
### నకిలీ బంగారు కడ్డీ, ల్యాప్‌టాప్, మొబైల్ స్వాధీనం





బాధితుడు డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీయగా బెదిరింపులకు దిగాడు.

**సీఐ కొండారెడ్డి పర్యవేక్షణలో పక్కా ప్రణాళికతో అరెస్ట్**

బాధితుడు రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ప్రొద్దుటూరు సిఐ కొండారెడ్డి పర్యవేక్షణలో ప్రొద్దుటూరు ఐ టౌన్ ఎస్ఐ జి మధుసూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. సిఐ కొండారెడ్డికి వచ్చిన సమాచారం మేరకు వారి సూచనలతో ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఆదివారం ఉదయం ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని వాసవి సర్కిల్ వద్ద దాడి చేశారు. అక్కడ సంచరిస్తున్న నిందితుడు కన్నయ్య (ప్రసాద్)ను అదుపులోకి తీసుకుని ఉదయం 10.30 గంటలకు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సదరు ముద్దాయి వద్ద నుంచి బంగారు కోటింగ్ ఉన్న నకిలీ కడ్డీ (సుమారు 100 గ్రాములు), ఒక ల్యాప్‌టాప్, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసును సమర్థవంతంగా పర్యవేక్షించి త్వరితగతిన ముద్దాయిని అరెస్ట్ చేసేలా ప్రత్యేక బృందాన్ని నడిపించిన సిఐ కొండారెడ్డి, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, సిబ్బందిని ఏఎస్పీ విభూకృష్ణన్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

# నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



(షణ్ముఖ వెలుగు, చీరాల, జులై 26)

ఆటోలో డాక్టర్ మరిచిపోయిన విలువైన బ్యాగ్‌ను యజమానికి క్షేమంగా అందించి చీరాల కొత్తపేటకు చెందిన ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్లు నిజాయితీని చాటుకున్నారు. జాండ్రపేటకు చెందిన డాక్టర్ పివి ప్రసాద్ కుటుంబంతో ఆటోలో ప్రయాణించి దిగిన తర్వాత బట్టలు, ఒరిజినల్ విద్యా ధ్రువపత్రాలు, ఆధార్ కార్డులు, మనీ పర్స్ ఉన్న బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయారు. ఫిర్యాదు అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఆటో యూనియన్ వాట్సాప్ గ్రూప్‌లో సమాచారం పంపగా, పోస్టు చూసిన డ్రైవర్ వెంకటేశ్వర్లు తన ఆటోలో బ్యాగ్ ఉన్నట్లు గుర్తించి వెంటనే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పోలీసులు బ్యాగ్‌ను ధృవీకరించి యజమానికి అందజేశారు. నిజాయితీ ప్రదర్శించిన వెంకటేశ్వర్లును సీఐ సోమశేఖర్, ఎస్ఐలు రాజ్యలక్ష్మి, వాణిశ్రీ అభినందించారు.

# కనీస వేతనాల పెంపు కై జులై 30, 31 తేదీల్లో జరిగే కలెక్టరేట్ ధర్నాలను జయప్రదం చేయండి

## స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రకాశం జిల్లా కమిటీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 26)




స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రకాశం జిల్లా కమిటీ పెళ్లూరు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటనపల్లి శ్రీనివాసులు పాల్గొని ప్రసంగించారు. సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూలై మాసంలో షెడ్యూల్డ్ పరిశ్రమల పని చేస్తున్న 66 రకాల కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని సర్వే నిర్వహించడం సమస్యలు గుర్తించడం అధికారులకు రిప్రజెంటేషన్ ఇవ్వడం చివరగా కలెక్టరేట్ ధర్నాకి పిలుపునివ్వడాన్ని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ స్వాగతిస్తున్నది. 30 31 తేదీలలోజరిగే కలెక్టరేట్ ధర్నాకు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుంది. ఏపీఎస్ఆర్టీసీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను అమలు చేస్తుంది. విద్యుత్ బస్సులను కొనుగోలు చేసి పినాకిల్ కంపెనీకి ఇవ్వాలని దుర్మార్గపు ఆలోచన ఏపీఎస్ఆర్టీసీ చేస్తుంది. ఈ విధానాన్ని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఈ విధానానికి వ్యతిరేకంగా జేఏసీ ఏర్పాటు నుంచి ఆందోళన చేయడం జరుగుతోంది ఏపీఎస్ఆర్టీసీ లో పనిచేస్తున్న కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ కార్మికులను ధర్నాకి సమీకరణ చేయాలని చెప్పి నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి అయ్యప్పరెడ్డి, జిల్లా కార్యదర్శి దాసరి మల్లికార్జునరావు, కందుకూరు డిపో కార్యదర్శి దాసరి రమణయ్య, అద్దంకి డిపో కార్యదర్శి పి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవ ఏర్పాట్ల పై సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే ఏలూరి హాజరు



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 26)

ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం (భోగాపురం ఎయిర్‌పోర్ట్) ప్రారంభోత్సవ సభ ఏర్పాట్లపై ఆదివారం భోగాపురం విమానాశ్రయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సహచర మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సమగ్ర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రైవేట్ స్థలాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుండగా, ఆయనకు స్వాగతం పలికేందుకు 13 వేల మంది బాలికలతో అరకు ధీంసా గిరిజన నృత్య ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు సమావేశంలో వెల్లడించారు. కార్యక్రమం విజయవంతానికి అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు.

## వైఎస్సార్సీపీ జిల్లా మైనార్టీ జనరల్ సెక్రటరీగా షేక్ మస్తాన్ వలి నియామకం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 26)

వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయం ఈరోజు ప్రకటించిన పలు జిల్లా ప్రధాన కార్యదర్శి నియామకాలలో పొదిలి ఇస్లాంపేటకు చెందిన షేక్ మస్తాన్‌వలి ఉమ్మడి జిల్లా మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మస్తాన్ వలి మాట్లాడుతూ తన పై నమ్మకం ఉంచి జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించేలా సహకరించిన గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జ్ అన్నా వెంకట రాంబాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కేవీ రమణారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, జీ శ్రీను, ముల్ల జాకిర్, షేక్ నూర్జహాన్, షేక్ రియాజ్‌తో పాటు పొదిలి మండల, పట్టణ వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. అలాగే రాబోయే రోజుల్లో మార్కాపురం నియోజకవర్గంలో పార్టీ మరింత బలపడుతుందని, 2029 ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థి అన్నా వెంకట రాంబాబు ఎమ్మెల్యేగా విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## పేకాట స్థావరం పై దాడి

(షణ్ముఖ వెలుగు, టంగుటూరు, జులై 26)

టంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వాసేపల్లి గ్రామల శివారులో ఆదివారం పేకాట స్థావరం పై టంగుటూరు ఎస్ఐ బి ఫణిభూషణ్, వారి సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.44,850 నగదు, 6 మొబైల్ ఫోన్లును, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వారి పై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేయటం జరిగింది.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com